
# కంపుకొడుతున్నా కనికరం లేదా?

తాండూరు, ఆగస్టు 18(ప్రజా స్వరం) :

తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిలో గత ఐదు రోజుల నుంచి పెద్ద ఎత్తున మురుగు నీరు నిలిచి కంపుగొడుతోంది. దానికి తోడు వర్షం కురిసి మరింత అధ్వానంగా తయారైంది. డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండడంతో పెద్ద ఎత్తున నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. ఆ పక్కనే ఉన్న జిల్లా దవాఖాలకు వచ్చే రోగులకు ఉన్న జబ్బులు పోవడం కాదు.. లేనిపోని కొత్త రోగాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. పట్టణంలోని జూనియర్ కళాశాలకు, హై స్కూలుకు, జిల్లా దవాఖానకు వెళ్లే వారికి, అడ్డా కూలీలకు, ఇబ్బందికరంగా మారింది. లైబ్రరీ నుంచి శాంతి మహల్ చౌరస్తా వరకు డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరించాలని, పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. శాంతి మహల్ చౌరస్తాలో చెత్త కూడా అక్కడ నిండిపోయింది. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు



ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని, వెంటనే చెత్త తొలగించకపోతే తాండూరు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. ఆదివారం తాండూర్ బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు శ్రీహరి, జిల్లా కార్యదర్శి భద్రేశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, పట్టణ కమిటీ ఉపాధ్యక్షులు ప్రకాష్, కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, తాండూర్ పట్టణ మైనార్టీ మోర్చా అధ్యక్షులు షాబుద్దీన్, రమ్యానాయక్, బూత్ అధ్యక్షుడు సాయిలు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్సీ పట్నం

వికారాబాద్, ఆగస్టు 28 (ప్రజా స్వరం) :

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, సునీతారెడ్డి దంపతులు, ఎన్వీ రమణారెడ్డి, చాముండేశ్వరి దంపంతులు, ఎన్వీ హిమదీప్ రెడ్డి, మనీషారెడ్డి దంపతులు ఆదివారం శ్రీశైలం శ్రీభ్రమరాంబమల్లిఖార్జున స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయ అధికారులు ప్రోటోకాల్‌తో ఆలయంలోకి స్వాగతం పలికి, స్వామివారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

## నీటి సమస్యకు ఎమ్మెల్యే పరిష్కారం



పరిగి, ఆగస్టు 18(ప్రజా స్వరం):

పరిగి నియోజకవర్గం గండిడ్ మండలం కొమ్మి రెడ్డిపల్లి గ్రామంలో కొన్నాళ్లుగా తీవ్రమైన తాగునీటి సమస్య తలెత్తడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే డాక్టర్ టి .రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించారు. బోరు వేయించి సమస్యను పరిష్కరించారు. కొమ్మిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చొరవ పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఆగస్ట్ 18(ప్రజాస్వరం) :

బడుగు, బలహీనవర్గాలు సర్వాయి పాపన్న పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ లో సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి ఉత్సవాలను వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా కలెక్టర్ హాజరై పాపన్న చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బహుజన రాజ్యాన్ని స్థాపించిన మొట్ట మొదటి వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అన్నారు. సర్వాయి పాపన్న సాధారణ కుటుంబంలో జన్మించి పశువుల కాపరిగా, గీతా కార్మికుడిగా తన ప్రస్థానంలో భాగంగా అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పోరాటం సలిపిన మహాయోధుడన్నారు. ఎలాంటి అండదండలు లేకుండా బడుగు కులాలను ఏకం చేసి భూస్వాములు, మొఘల్‌లు శిస్తుల రూపంలో పన్నుల వసూల్ల పేరుతో ప్రజలను పీడిస్తున్న క్రమంలో వారికి అండగా నిలిచి పోరాటం చేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల విద్యార్థులు దేశభక్తి పాటలను ఆలపించారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ వసతి గృహాల బాల, బాలికలకు నోటు పుస్తకాలు, పెన్నులను బహుకరించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఉపేందర్, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భీమరాజు, వసతిగృహ సంక్షేమ అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బహుజన యోధుడు సర్వాయి పాపన్న

వికారాబాద్, ఆగస్టు 18(ప్రజాస్వరం):

సర్వాయి పాపన్న 374వ జయంతి వేడుకలను వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం, ప్రజాసంఘాల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారుల నాయకుడు సంజయ్ గౌడ్, తెలంగాణ ఉద్యమకారుడు న్యాయవాది జిలాని, తాండూర్ మండల యూటీఎఫ్ అధ్యక్షులు నారాయణగౌడ్ మాట్లాడుతూ మొఘల్ పాలకుల ఆధిపత్యాన్ని ఎదిరించి బహుజన రాజ్య స్థాపనకు సర్వాయి పాపన్న నడుం కట్టిన యోధుడని గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలుగు పండిత్ విజయ్ కుమార్, ఎస్ఎఫ్ఐ తాండూర్ డివిజన్ కార్యదర్శి సిరియాల, ఎమ్మార్పీఎస్ తాండూర్ పట్టణ సీనియర్ నాయకులు బలరాం, ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మౌలానా, సీపీఎం నాయకులు సయ్యద్, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.








## ఘనంగా గడి మైసమ్మ బోనాల పండుగ

మేడ్చల్, ఆగస్టు 18(ప్రజా స్వరం) :

మేడ్చల్ పట్టణంలో గడి మైసమ్మ తల్లి శ్రావణమాసం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి పాలాభిషేకంతోపాటు, సహస్రనామాలతో కుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల్లో అమ్మవారికి తొట్టెల ఊరేగింపు కార్యక్రమాన్ని ఆలయ భక్త బృందం సభ్యులు చేపట్టారు. గడి మైసమ్మ తల్లిని దర్శించుకోవడానికి మేడ్చల్ మండలంలోని గ్రామాల ప్రజలు పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి గడి మైసమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక బోనాలు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారి నియోజకవర్గానికి సంబంధించిన పలువురు పార్టీ ప్రముఖులు దర్శించుకుని పూజలు చేశారు. దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశామని, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశామన్నారు. మేడ్చల్ పట్టణంలో యువకులు



పలహారం బండ్ల ఊరేగింపును తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న గడి మైసమ్మ తల్లి ఆలయం వరకు తీసుకెళ్లి పూజలు చేశారు. పలహారం బండ్ల మండల వద్ద పోతరాజుల నృత్యాలు, డప్పు చప్పుళ్ళు ఆకర్షణగా నిలిచాయి. బోనాల పండుగ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మేడ్చల్ పోలీసులు పట్టణ వ్యాప్తంగా బందోబస్తు ఏర్పాటు చేశారు.



## బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో రక్షాబంధన్

### పాల్గొన్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



వికారాబాద్, ఆగస్టు 18(ప్రజా స్వరం) :

వికారాబాద్ పట్టణంలోని ఓంశాంతి భవన్‌లో ఆదివారం బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షాబంధన్ కార్యక్రమానికి తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్పీకర్‌తో కలిసి వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధు అక్కయ్య స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు రక్షాబంధన్ కట్టి సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్ గోపాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

